

పోస్ట్ కార్డులను ప్రదర్శిస్తున్న ఉద్యమకారులు

ఉద్యమకారులకు న్యాయం చేయాలి

● పోస్ట్ కార్డుల ద్వారా ప్రభుత్వానికి వినతి

ఎర్రగడ్డ, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమకారులు ఎన్నో కష్టాలు పడుతున్నారని, వారికి న్యాయం చేయాలని కోరుతూ ఉద్యమకారులు రాష్ట్ర ప్రభుత్వానికి పోస్ట్ కార్డులను పంపించారు. ఆదివారం మోతీనగర్‌లోని పోస్ట్ ఆఫీస్‌లో ఉద్యమకారులు తమ సమస్యలను రాసిన పోస్ట్ కార్డులను వేశారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు సీమ శ్రీనివాస్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఉద్యమకారులకు పది వేల కోట్ల రూపాయలతో సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని, 250 గజాల ఇంటి స్థలం ఇస్తామని వాగ్దానాలు చేసిన ఆ పార్టీ నేతలు ఏ ఒక్కటీ నెరవేర్చలేదన్నారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులకు, వయసు పైబడ్డ వృద్ధులకు 25 వేల రూపాయలు పెన్షన్ ఇస్తామని చెప్పారని గుర్తుచేశారు. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో పోస్టు కార్డుల కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఇందర్‌కుమార్, బ్యాకరి చంద్రశేఖర్, మహమ్మద్ గౌసుద్దీన్, ఎస్.సెబాస్టియన్, కుమారస్వామి, నర్సింగరావు, సురేందర్, ఆర్.ప్రభాకర్, బుగ్గప్ప అంజయ్య తదితరులు పాల్గొన్నారు.



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న ఆయుర్వేద ప్రముఖులు

ఆయుర్వేద కళాశాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ఎర్రగడ్డ, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఎర్రగడ్డలోని ఆయుర్వేద కళాశాలలో స్వర్ణోత్సవ ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. ఐదు దశాబ్దాల క్రితం ఆయుర్వేద వైద్య విద్యలో చేరిన వారంతా ఒకచోట కలవడం ఎంతో ఆనందంగా ఉందని ఆయుష్ విభాగం మాజీ అడిషనల్ డైరెక్టర్ నరసింహారెడ్డి అన్నారు. 50 సంవత్సరాల క్రితం ఆయుర్వేద విద్యనభ్యసించిన ప్రస్తుత ప్రముఖులు ఆయుర్వేద కళాశాలలో కలిసి స్వర్ణోత్సవ ఆత్మీయ సమ్మేళన వేడుకలను నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైద్య విద్యనభ్యసించేందుకు ఇప్పుడు ఉన్నన్ని సౌకర్యాలు ఆ రోజుల్లో లేనప్పటికీ పట్టుదలతో వైద్య విద్యను పూర్తిచేసి మెరుగైన సేవలు అందించామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయుర్వేద వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రమాదేవి, మాజీ ప్రిన్సిపాల్ శశిరెడ్డి, డాక్టర్ పాటిల్, డాక్టర్ టి.శ్రీనివాసరావు, వైద్యులు మాణిక్ శర్మ, విటల్‌రావు, కొండల్ రెడ్డి, అరవింద్ గుప్తా, సత్యం, జగదీష్, శ్యాంసుందర్, విశ్వపతి, దత్తాత్రేయ, రామచంద్ర మూర్తి, కిషన్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.



కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న ఆలయ కమిటీ చైర్మన్ మహేష్‌యాదవ్, భక్తులు

ఘనంగా మల్లికార్జునస్వామి కల్యాణం

బోరబండ, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): బోరబండ సైట్-3లోని భ్రమరాంబ మల్లికార్జునస్వామి దేవస్థానంలో మల్లన్నస్వామి 17వ కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. వేడుకలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. కల్యాణం అనంతరం పెద్దపట్నం, అగ్నిగుండం, గొలుసు తెంపుట వంటి కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి ఎల్లమ్మ తల్లికి బోనం చెల్లించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మానుక మహేష్ యాదవ్, ప్రతినిధులు ఆంజనేయులు యాదవ్, శివ యాదవ్, శంకర్ యాదవ్, వీరేష్ యాదవ్, రవీంద్ర యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగం పేరుతో మహిళకు టోకరా

అమీర్‌పేట, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగం ఇప్పిస్తానని మహిళను మోసం చేసిన వ్యక్తిపై ఎస్ఆర్ నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఉద్యోగ అవకాశాలపై ప్రకటన చూసిన కైతలాపూర్‌కు చెందిన డి.రోజా మూసాపేటలోని ఎర్త్ సెక్యూరిటీ కాంట్రాక్ట్ మ్యాన్ పవర్ సర్వీసెస్ అనే ఔట్ సోర్సింగ్ సర్వీసెస్ కార్యాలయాన్ని సంప్రదించింది. ఉద్యోగం కోసం ఏజెన్సీ నిర్వాకుడు మాడుగుల సురేష్‌ను కలవగా రూ.40 వేలు తీసుకుని కేపీహెచ్‌బీ కాలనీలోని బస్తీ దవాఖానాలో కాంట్రాక్ట్ పద్ధతిన కేవలం ఒక సంవత్సరం పాటు ఉద్యోగంలో చేర్పించారు. గడువు తీరిన తరువాత మరో రూ.లక్ష చెల్లిస్తే స్టాఫ్ నర్సుగా ఉద్యోగంలో పెట్టిస్తానని చెప్పడంతో అమీర్‌పేట అన్నపూర్ణ బ్లాక్‌లో ఉన్న మరో కార్యాలయం ద్వారా రూ.80 వేలు చెల్లించింది. స్టాఫ్ నర్సు ఉద్యోగం కోసం అమీర్‌పేటలోని కార్యాలయానికి వెళ్లింది. అప్పటికే ఆ కార్యాలయం మూసివేశారు. నిర్వాహకుడు సురేష్‌కు ఫోన్ చేస్తే స్పందించలేదు. డబ్బు తీసుకుని మూడు సంవత్సరాలైనా ఉద్యోగం రాకపోవడంతో మోసపోయానని గ్రహించి బాధితురాలు ఎస్ఆర్ నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ఎర్రగడ్డలో రహదారుల అభివృద్ధి

● డివిజన్ పరిధిలో ఫుట్‌పాత్‌ల నిర్మాణంపై అధికారుల దృష్టి

● ప్రమాదాల నివారణతో పాటు పరిశుభ్రత నెలకొనే అవకాశం

ఎర్రగడ్డ, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఫుట్‌పాత్‌ల నిర్మాణాలతో రోడ్లు అందంగా దర్శనమిస్తున్నాయి. ఎర్రగడ్డ డివిజన్‌లోని చాలా ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌ల నిర్మాణాలు జరుగుతున్నాయి. డివిజన్‌లోని డాన్‌బాస్కో స్కూల్, జనప్రియ అపార్ట్‌మెంట్స్, శ్రీరాంనగర్ పార్కు, ఏజీ కాలనీ, జేజే హాస్పిటల్, ఎర్రగడ్డ జాతీయ రహదారి తదితర రోడ్లలో ఫుట్‌పాత్‌ల నిర్మాణాలు చేపట్టారు. కొన్ని ప్రాంతాల్లో నిర్మాణాలు పూర్తి కాగా, మరికొన్ని ప్రాంతాల్లో కొనసాగుతున్నాయి. స్థానిక ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ చొరవతో డివిజన్‌లోని డాన్‌బాస్కో స్కూల్ నుంచి జనప్రియ అపార్ట్‌మెంట్స్ వరకు రూ.4 లక్షల వ్యయంతో చేపట్టిన పనులు పూర్తయ్యాయి.

ఫుట్‌పాత్‌ల నిర్మాణంతో పాదచారులకు మేలు..

రోడ్లపై ఫుట్‌పాత్‌లు లేకపోవడం వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతుంటాయి. పాదచారులు రోడ్లపై నడిచే సమయంలో ప్రమాదాలకు గురవుతుంటారు. వాహనదారులు సైతం నిబంధనలకు విరుద్ధంగా ప్రయాణిస్తుండడం వల్ల పాదచారులకు ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఫుట్‌పాత్‌లు ఉన్న రోడ్లలో ప్రమాదాల సంఖ్య తక్కువగా ఉంటుంది. అయితే కొన్ని ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌లను ఆక్రమించుకుని కొందరు వ్యాపారాలు చేస్తున్నారు. కొత్తగా నిర్మిస్తున్న ప్రాంతాల్లో అలాంటి పరిస్థితి తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. డాన్‌బాస్కో స్కూల్ నుంచి జనప్రియ అపార్ట్‌మెంట్స్ వరకు వెళ్లే రహదారిలో గతంలో రోడ్డుకు ఇరువైపులా మూత్ర విసర్జన చేయడంతో పాటు పెద్ద ఎత్తున చెత్త వేస్తుండేవారు. దీంతో వాహనదారులతో పాటు పాదచారులు ఇబ్బందులు పడేవారు. ప్రస్తుతం ఫుట్‌పాత్‌లను నిర్మించడం వల్ల ఈ రోడ్డు పరిశుభ్రంగా తయారైంది.



డాన్‌బాస్కో స్కూల్ రోడ్డులో నిర్మించిన ఫుట్‌పాత్

పాదచారులు ఫుట్‌పాత్‌లపైనే నడవాలి



లక్షల రూపాయల వ్యయంతో ఫుట్‌పాత్‌లను నిర్మిస్తున్నారు. పాదచారులు బాధ్యతాయుతంగా ఉంటూ ఫుట్‌పాత్‌లపైనే నడవాలి. ఈ విధంగా చేస్తే ప్రమాదాల బారిన పడకుండా ఉంటాం. మరోవైపు ఫుట్‌పాత్ నిర్మాణాలతో పరిశుభ్రత నెలకొంటుంది.

\- మొహమ్మద్ మోహసిన్ ఖురేషి, ప్రేమ్‌నగర్

మరికొన్ని ప్రాంతాల్లో నిర్మాణాలకు చర్యలు

ఎర్రగడ్డ డివిజన్‌లోని చాలా రహదారుల్లో ఫుట్‌పాత్ నిర్మాణాలను చేపడుతున్నాం. ఇప్పటికే కొన్ని రోడ్లలో నిర్మాణాలు పూర్తికాగా, మరికొన్ని ప్రాంతాల్లో నిర్మాణాలు చేపట్టాల్సి ఉంది. శ్రీరాంనగర్ పార్కు చుట్టూ, ఏజీ కాలనీ, జేజే హాస్పిటల్, మీటర్ ఫ్యాక్టరీ, సుల్తాన్‌నగర్, హేమావతినగర్, శాస్త్రినగర్ ప్రాంతాలలో ఫుట్‌పాత్‌ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నాం.

\- అవినాష్, మున్సిపల్ ఏఈ

సైబర్ నేరాలపై సినీ నటుల అవగాహన

బంజారాహిల్స్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): సైబర్ క్రైమ్ బాధితుల సంఖ్య రోజురోజుకు పెరిగిపోతోందని సినీ నిర్మాత బెక్కం వేణుగోపాల్ అన్నారు. సైబర్ నేరాలపై అవగాహన కలిగించేందుకు 'సైబర్ దొంగలున్నారు తస్మాత్ జాగ్రత్త' అనే నినాదంతో తకిట తదిమి తందాన చిత్ర యూనిట్ ఆదివారం ఫిలింనగర్ నుంచి జగన్నాథస్వామి దేవాలయం, కేబీఆర్ పార్కు వరకు సైకిల్ ర్యాలీ నిర్వహించింది. జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించిన వేణుగోపాల్ మాట్లాడుతూ.. సాంకేతిక పరిజ్ఞానం ఎంతలా పెరుగుతుందో అదే స్థాయిలో సైబర్ మోసాలు పెరుగుతున్నాయన్నారు. సైబర్ మోసగాళ్ల బారిన పడిన వారు ఆర్థికంగా కోలుకోలేని స్థితికి వెళ్లిపోతున్నారన్నారు. పోలీసు అధికారుల సూచనలను తప్పకుండా పాటించాలని ఆయన సూచించారు. ర్యాలీలో సినీ దర్శకుడు చంద్ర మహేశ్, నటుడు రాంకీ, ఫెటాఫ్సీ చైర్మన్ హరి గోవింద ప్రసాద్, హెచ్‌సీజీ అధ్యక్షుడు రవీంద్ర, చిత్ర నిర్మాత చందన్ కుమార్ కొప్పుల, నటులు గణ ఆదిత్య, హీరోయిన్ ప్రియ, దర్శకుడు రాజ్ లోహిత్ పాల్గొన్నారు.



సైకిల్ ర్యాలీలో పాల్గొన్న సినీ నటులు

దాశరథి, ఆరుద్రల సాహిత్యం సమాజానికి అవసరం

● సీనియర్ జర్నలిస్ట్ తెలకపల్లి రవి

రాంనగర్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): దాశరథి, ఆరుద్రల సాహిత్యం నేటి సమాజానికి ఎంతో అవసరమని, ఆధునిక తెలుగు సాహిత్య రంగంలో తమ కవిత్వంతో వినూత్న శఖాన్ని సృష్టించిన మహాకవులని ప్రముఖ విమర్శకులు, సీనియర్ పాత్రికేయులు తెలకపల్లి రవి అన్నారు. ఆదివారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ సాహితీ ఆధ్వర్యంలో దాశరథి, ఆరుద్రల శతజయంతి సందర్భంగా సాహిత్య సమాలోచన సదస్సు జరిగింది. ఈ సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్న తెలకపల్లి రవి మాట్లాడుతూ.. అవినీతికి, అరాచక పాలనకు ఎదురు తిరిగి తన కలాన్నే ఆయుధంగా ఎక్కుపెట్టి సింహగర్జన చేసిన మహాకవి డాక్టర్ దాశరథి అన్నారు. అగ్నిధార, రుద్రవీణ, తిమిరంతో సమరం వంటి కథా సంపుటాలు దాశరథి కవితా ఆవేశాన్ని చాటి చెబుతాయన్నారు. కుషికుషీగా అంటూ ఎన్నో సినిమా పాటలు రాసి వెండితెరపై తన ముద్రను పదిలంగా ప్రతిష్టించారని చెప్పారు. తెలంగాణ పోరాట దృక్పథంతో త్వమేవాహం వంటి కావ్యాన్ని రాసిన మహాకవి డాక్టర్ ఆరుద్ర అన్నారు. సమగ్రాంధ్ర సాహిత్యం ఆయనను గొప్ప పరిశోధకుడిగా నిలబెట్టిందన్నారు. హైదరాబాద్ బుక్ ఫెయిర్ అధ్యక్షుడు, కవి యాకుబ్ మాట్లాడుతూ.. తెలంగాణ సాహితి వినూత్న కార్యక్రమాలు చేస్తుందన్నారు. అందులో భాగంగానే దాశరథి, ఆరుద్ర మహాకవుల శతజయంతి సమాలోచన సదస్సు నిర్వహించామన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎవరూ చేయలేని పనిని సాహితీ సంస్థ చేస్తుందన్నారు. తెలంగాణ రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగేశ్వరం శంకరం, డాక్టర్ తిరుమలగిరి శరత్‌చంద్ర, అనంతోజు మోహనకృష్ణ, గంజి శశిధర్, మౌన శ్రీ మల్లిక్, డాక్టర్ లక్ష్మి ఆసిరెడ్డి, బండారు రాజ్‌కుమార్ పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న తెలకపల్లి రవి

గంజాయి మత్తులో స్నేహితుల మధ్య ఘర్షణ

● కత్తితో దాడి.. ఇద్దరికి తీవ్ర గాయాలు

సైదాబాద్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): గంజాయి మత్తులో స్నేహితుల మధ్య ఘర్షణ కత్తిపోట్లకు దారితీసింది. ఈ ఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలు కాగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. సింగరేణికాలనీ ఘనపురం గుడిసెలలో నివాసముంటూ కేటరింగ్ పనులు నిర్వహించే కాట్రవత్ జగన్(17) అంగోతు హర్ష(20), మధు, చంటిలు శనివారం రాత్రి చంద్రాయణగుట్టలో డిన్నర్‌కు వెళ్లి తిరిగివచ్చారు. అందరూ కలిసి జగన్ ఇంటి వద్ద కూర్చొని మాట్లాడుకుంటున్నారు. ఇంతలో అదే ప్రాంతంలో ఉండే మరో స్నేహితుడు ఆటోడ్రైవర్ ముదావత్ సురేష్(20) కత్తితో వచ్చి ఘర్షణకు దిగాడు. జగన్‌పై సురేష్ కత్తితో దాడి చేసేందుకు యత్నించగా అడ్డుకునేందుకు యత్నించిన హర్ష చాతికి గాయాలయ్యాయి. వెంటనే స్నేహితులు హర్షను స్థానికంగా ఆస్పత్రికి తరలించారు. అనంతరం తిరిగి జగన్ ఇంటికి మధు, చంటిలు వచ్చి కూర్చోని మాట్లాడుకుంటున్నారు. వాళ్లను గమనించిన సురేష్ అక్కడికి వచ్చి మరోసారి జగన్‌పై కత్తితో దాడికి యత్నించాడు. ప్రతిఘటించిన జగన్ అదే కత్తితో సురేష్‌పై దాడి చేసి తీవ్రంగా గాయపర్చాడు. వెంటనే స్థానికులు సురేష్‌ను చికిత్స కోసం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. గంజాయి మత్తులోనే ఈ దాడులు జరిగాయని తెలుస్తోంది.



మంటల్లో కాలిపోతున్న బస్సు

అగ్నిప్రమాదంలో కాలి బూడిదైన బస్సు

గాజులరామారం, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): పార్కింగ్ చేసి ఉన్న నూతన బస్సులో నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో బస్సు పూర్తిగా దగ్ధమైంది. సూరారంలోని కట్టమైసమ్మ దేవాలయం సమీపంలో పోర్టుమోనో కంపెనీకి చెందిన బస్సు నిలిపి ఉన్న బస్సులో ఒకేసారి మంటలు చెలరేగాయి. ఇది గమనించిన స్థానికులు అగ్ని మాపక సిబ్బందికి ఫిర్యాదు చేశారు. అగ్ని మాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేశారు. ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.



కార్పొరేటర్ సీఎన్ రెడ్డితో అంగన్‌వాడీ సిబ్బంది

అంగన్‌వాడీ సిబ్బంది సమస్యలను పరిష్కరిస్తాం

● కార్పొరేటర్ సీఎన్ రెడ్డి

బోరబండ, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): తల్లులకు, పిల్లలకు పౌష్టికాహారాన్ని తప్పకుండా అందించాలని కార్పొరేటర్ సీఎన్ రెడ్డి అంగన్‌వాడీ సిబ్బందికి సూచించారు. బోరబండ డివిజన్‌కు చెందిన అంగన్‌వాడీ టీచర్లు ఆదివారం కార్పొరేటర్‌ను కలిసి సమస్యలను వివరించారు. అంగన్‌వాడీ సెంటర్‌లో అందిస్తున్న సేవలు, సమస్యలను తెలుసుకున్న కార్పొరేటర్.. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

బోరబండ, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): జ్ఞానేంద్రియాలు అతి సున్నితమైనవని, వాటిని జాగ్రత్తగా చూసుకోవాలని బిషప్ కె.విద్యాసాగర్ అన్నారు. ఆదివారం క్రీస్తు లూథరన్ సంఘం ఆధ్వర్యంలో కార్మికనగర్‌లో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరానికి వచ్చిన వారికి కంటి, బీపీ, షుగర్ పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు సి.బ్యూలా గ్రేసి, కె.గిప్సన్ రూబిపాల్, ఎల్.రాజు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చికెన్‌పై తప్పుడు ప్రచారం సరికాదు

● బోరబండ పౌల్ట్రీ అసోషియేషన్ అధ్యక్షుడు గౌసుద్దీన్

బోరబండ, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): చికెన్ తింటే బర్డ్ ఫ్లూ వస్తుందని కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని, ఈ ప్రచారాన్ని నమ్మవద్దని బోరబండ పౌల్ట్రీ అసోషియేషన్ అధ్యక్షుడు ఎండీ గౌసుద్దీన్ అన్నారు. బోరబండ బస్టాప్‌లో చికెన్ మేళా నిర్వహించి ప్రయాణికులకు చికెన్ వంటకాలను అందజేశారు. ఈ సందర్భంగా గౌసుద్దీన్ మాట్లాడుతూ.. పౌల్ట్రీ వ్యాపారులను దెబ్బతీసేందుకు కొందరు పనిగట్టుకొని తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు.



ప్రజలకు చికెన్ వంటకాలను అందజేస్తున్న వ్యాపారులు

రేపు డిగ్రీ, పీజీ విద్యార్థులకు ప్రాజెక్టు వర్క్‌పై అవగాహన

ఖైరతాబాద్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): డిగ్రీ, పీజీ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ప్రాజెక్టు వర్క్‌పై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నారు. లక్డీకాపూల్‌లోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ కామర్స్ (ఐఐఎంసీ), ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజెల ఆధ్వర్యంలో ఈ నెల 25న ఉస్మానియా యూనివర్సిటీ, ఐపీఈలకు చెందిన 11 మంది నిష్ణాతులైన ప్రొఫెసర్లతో ఈ సదస్సు నిర్వహిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ కూర రఘువీర్ తెలిపారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను కళాశాలలో ఆదివారం ఆయన ఆవిష్కరించారు. జంటనగరాల్లోని అన్ని కళాశాలల విద్యార్థులు ఇందులో పాల్గొనవచ్చని చెప్పారు. ప్రాజెక్టు వర్క్‌లను సులభంగా చేయడంపై మెలకువలు చెబుతామన్నారు. వివరాల కోసం 9989220163, 9010770605 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.



ప్రమాదకరంగా కారు నడిపిన నిందితులు

ప్రమాదకరంగా కారు నడిపిన వారిపై కేసు

బంజారాహిల్స్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): ప్రమాదకరంగా కారు డ్రైవింగ్ చేస్తున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు వద్ద ఓ వ్యక్తి తోటి ప్రయాణికులకు ఇబ్బంది కలిగించేలా కారు నడపడంత పాటు ఆ వీడియోలను సోషల్ మీడియాలో పెట్టారు. వీడియో ఆధారంగా జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. వాహనం నంబర్ ఆధారంగా విచారణ చేయగా కారు నడిపిన వారు విద్యార్థులని తేలింది. మలక్‌పేటకు చెందిన మహ్మద్ అబ్దుల్ ఖాదర్, నాంపల్లికి చెందిన అన్నాస్ అహ్మదుద్దీన్, బంజారాహిల్స్‌కు చెందిన మహ్మద్ అబ్దుల్ రాహత్‌లను అరెస్టు చేసి వారు నడిపిన కారును స్వాధీనం చేసుకున్నారు.





చీరకట్టుతో రన్‌లో పాల్గొన్న మహిళలు





ఉత్సాహంగా శారీ రన్..

పులకించిన పీవీ మార్గ్

చీరకట్టుతో మెరిసిన వేలాది మంది మహిళలు

ఖైరతాబాద్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): వేలాది మంది మహిళలు చీరలు కట్టుకొని ఉత్సాహంగా సాగర తీరం వెంట సాంప్రదాయాన్ని ప్రతిబింబించారు. చీరతో కూడిన అందాన్ని ఫిట్‌నెస్‌తో జోడిస్తూ తనైరా, జేజే యాక్టివ్‌ల సంయుక్త నిర్వహణలో పీవీ నర్సింహారావు మార్గ్‌లోని పీపుల్స్‌ప్లాజా నుంచి జలవిహార్ వరకు, తిరిగి పీపుల్స్ ప్లాజా వరకు సాగిన ఈ రన్‌లో మూడు వేలకు పైగా మహిళలు నృత్యా లు చేస్తూ సంబరంగా పాల్గొన్నారు. మహిళా సాధికారత, స్వేచ్ఛ, ఆరోగ్య పరిరక్షణలపై అవగాహన కల్పిస్తూ సాగిన ఈ రన్‌ను జేజే యాక్టివ్ కోచ్ ప్రమోద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా తనైరా సీఈవో అంబుజ్ నారాయణ మాట్లాడుతూ.. మహిళలు కుటుంబ భారాన్ని మోయడమే కాకుండా తమ ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు వ్యాయామం చేయాలని సూచించారు. ఈ రన్ మహిళల సాంప్రదాయం, ఆధునిక శక్తిని కలపడంతో పాటు దయ, స్థిరత్వంకు చిహ్నంగా నిలిచిందన్నారు. మహిళలు ఆరోగ్యం, సమగ్రతను ప్రోత్సహించడం ద్వారా సమాజ శక్తిని బలోపేతం చేస్తారన్నారు. మహిళలు సౌకర్యవంతమైన, ప్రోత్సాహకరమైన వాతావరణంలో తమ ఆరోగ్య పరిరక్షణ కోసం సమయం వెచ్చించాలని సూచించారు.



ఉత్సాహంగా పరుగులు తీస్తూ..



సంత్‌గాడ్గే బాబా జయంతి వేడుకల్లో పాల్గొన్న బీజేపీ నేత భరత్‌గౌడ్ తదితరులు

సంత్‌గాడ్గే బాబాకు నివాళి

సికింద్రాబాద్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మెట్టుగూడ చౌరస్తాలో కర్మయోగి సంత్‌గాడ్గే బాబా 149వ జయంతి వేడుకలను ఆదివారం నిర్వహించారు. మల్లేశ్వరపు రాజేశ్వరి ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో బీజేపీ మహంకాళి జిల్లా అధ్యక్షుడు గుండగోని భరత్‌గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొని సంత్‌గాడ్గే బాబా చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా భరత్‌గౌడ్ మాట్లాడుతూ.. మహారాష్ట్రలో పుట్టిన మట్టిలో మాణిక్యం సంత్‌గాడ్గే బాబా అని, స్వచ్ఛ భారత్ సృష్టి కర్త అని కొనియాడారు. రాజేశ్వరి మాట్లాడుతూ.. సంత్‌గాడ్గే బాబాకు సరైన గౌరవం దక్కడం లేదన్నారు. రజక కుటుంబంలో పుట్టినందుకు ప్రభుత్వాలు చిన్నచూపు చూస్తున్నాయని విమర్శించారు. బీజేవైఎం నగర అధ్యక్షుడు శివాజీ, నాయకులు ప్రభుగుప్తా, సరోజ, చందు తదితరులు పాల్గొన్నారు.



దర్గాలో ప్రార్థనలు చేస్తున్న శ్రీనివాస్‌గౌడ్ తదితరులు

దర్గాలో ప్రార్థనలకు హాజరైన శ్రీనివాస్‌గౌడ్

రాంగోపాల్‌పేట్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): నల్లగుట్ట సి లైన్ బస్తీ దర్గాలో పీర్ హజ్రత్ సయ్యద్ గులాం అలీ షా క్వాద్రీ ఉరుస్ ఏ షరీఫ్ హజ్రత్ పీర్‌లో బీఆర్ఎస్ రాంగోపాల్‌పేట్ డివిజన్ అధ్యక్షులు అతెల్లి శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దర్గా కమిటీ సభ్యులు అష్రాఫ్, షంషుద్దీన్, సర్ఫరోష్, ముజాహిద్, అబ్దుల్ గఫార్, మహ్మద్ ఫారూక్, లతీఫ్ ఖాన్, అస్లం పాల్గొన్నారు.



ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను కలిసిన డీఎస్‌ఎం కాలనీ అభివృద్ధి కమిటీ సభ్యులు

కాలనీల అభివృద్ధికి కృషి చేయాలి

సికింద్రాబాద్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): ప్రజలకు అందుబాటులో ఉంటూ కాలనీల అభివృద్ధికి కమిటీ సభ్యులు కృషి చేయాలని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ సూచించారు. సనత్‌నగర్‌లో డీఎస్‌ఎం కాలనీ అభివృద్ధి కమిటీ నూతన సభ్యులు ఆదివారం తలసానిని మర్యాదపూర్వకంగా కలిశారు. కాలనీ అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు ఉంటాయని, సమస్యలను తనదృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో కమిటీ చైర్మన్ నోమానోద్దీన్, అధ్యక్షుడు జమీర్, ప్రధాన కార్యదర్శి మన్నన్, ఉపాధ్యక్షుడు శంషేర్, అబ్దుల్ రహీం, సర్దార్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాయామశాలలకు నిధులు మంజూరు చేయిస్తా

- జంపన ప్రతాప్

సికింద్రాబాద్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ చింతలబస్తీలోని జైరామ్ వ్యాయామశాలకు ఎమ్మెల్యే శ్రీగణేశ్‌తో మాట్లాడి రూ.20 లక్షల నిధులు మంజూరు చేయిస్తానని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ అన్నారు. ఆదివారం జైరామ్ వ్యాయామశాలలో కమిటీ సభ్యులు నిర్వహించిన కాళికామాత శాంతి పూజ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జంపనప్రతాప్ మాట్లాడుతూ.. ఈ వ్యాయామశాలకు 75 సంవత్సరాల చరిత్ర ఉందని, ఇక్కడ నుంచి ఎంతోమంది జాతీయ స్థాయి బాడీ బిల్డింగ్ పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజుయాదవ్, దామోదర్, బచ్చన్‌రాజు, దిలీప్, సందీప్, గిరి, హరీష్, సాయికిషోర్, భరత్, పోతరాజు, సాయి తదితరులు పాల్గొన్నారు.



కాళికామాత శాంతి పూజలో పాల్గొన్న జంపన ప్రతాప్

శ్మశానవాటికకు దారేది?

- డివైడర్ అడ్డుగా ఉండటంతో రాంగ్ రూట్‌లో వెళ్లాల్సిన పరిస్థితి
- రాకపోకలకు ఇబ్బందులు

తిరుమలగిరి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): స్మశానవాటికకు రాజీవ్ రహదారి నుంచి వెళ్లేందుకు డివైడర్ అడ్డుగా ఉండటంతో రాంగ్ రూట్‌లో వెళ్లాల్సి వస్తోంది. అసలే రాజీవ్ రహదారి కావడంతో అధిక సంఖ్యలో వాహనాలు రాకపోకలు కొనసాగిస్తుంటాయి. మృతదేహాలను తీసుకుని రాంగ్ రూట్‌లో వెళ్తుంటే పెద్ద ఎత్తున వాహనాలు రాకపోకలు కొనసాగిస్తున్న నేపథ్యంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. తిరుమలగిరి, లోత్‌కుంట, అల్వాల్, బొల్లారం, నేరేడ్‌మెట్ తదితర ప్రాంతాల నుంచి మృతదేహాలను సాంప్రదాయబద్ధంగా వాహనంలో తీసుకెళ్తుంటారు. అయితే స్వర్గధామంకు ఎదురుగా జాతీయ రహదారి అధికారులు, కంటోన్మెంటు అధికారులు ముందు చూపు లేకుండా డివైడర్‌ను ఏర్పాటు చేశారు. డివైడర్‌ను ఏర్పాటు చేయడంతో ముందుగా ఉన్న యూ టర్న్ నుంచి రాంగ్ రూటులో మృతదేహాలను లోపలికి తీసుకెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. స్థానికులు అనేకసార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. అవసరం లేని చోట అధికారులు డివైడర్ ను ఏర్పాటు చేయకుండా, అవసరం లేని ప్రాంతాల్లో ఏర్పాటు చేయడం ఏంటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. స్వర్గధాంకు మృతదేహాలను తీసుకువెళ్లే వాహనాల కోసం డివైడర్‌ను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.



శ్మశానవాటికకు వెళ్లేదారిలో అడ్డుగా ఉన్న డివైడర్

ప్రమాదాలు జరుగుతున్నాయి



స్వర్గధామంకు వెళ్లేందుకు డివైడర్ అడ్డుగా ఉండటంతో వాహనాలు రాంగ్ రూట్‌లో వెళ్తున్నాయి. దీంతో మృతుల బంధువులు అధికంగా ఉన్న సమయంలో వాహనాలు బారులు తీరుతున్నాయి. తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు వెంటనే స్పందించి డివైడర్‌ను తొలగించాలి.

- నరసింహన్ కన్నన్, స్థానికుడు

తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం



స్వరధామం ముందు ఉన్న డివైడర్‌ను తొలగించాలని ప్రజలు మా దృష్టికి తీసుకువస్తే పరిశీలిస్తాం. ఇప్పటి వరకు దీనిపై ఎవరూ ఫిర్యాదు చేయలేదు. అవసరమైతే డివైడర్‌ను తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం.

- మధుబాబు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్

బౌద్ధనగర్‌లో పర్యటించిన సంతోష్‌కుమార్

బౌద్ధనగర్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): బౌద్ధనగర్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో ఆదివారం కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ ఇన్‌చార్జి ఆదం సంతోష్‌కుమార్ పర్యటించారు. ఎల్.నారాయణనగర్, అశోక్‌నగర్, సంజీవపురం, అంబానగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించి తాగునీరు, డ్రైనేజీ, విద్యుత్ దీపాలు, పారిశుధ్యం తదితర సమస్యలపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. బస్తీవాసులు తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను అధికారులతో మాట్లాడి పరిష్కారిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ వైస్ చైర్మన్ ఆదం సృజన్‌కుమార్, డివిజన్ అధ్యక్షుడు అనిల్‌కుమార్, నాయకులు షకీల్‌ఖాన్, అమర్‌నాథ్‌గౌడ్, వాహీదుద్దీన్, బబ్లూ, శ్రీకాంత్, హుస్సేన్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజలను అడిగి సమస్యలు తెలుసుకుంటున్న ఆదం సంతోష్‌కుమార్

విద్యకు 15శాతం నిధులు కేటాయించాలి

డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పులి కల్పన

బౌద్ధనగర్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 15శాతం నిధులు కేటాయించాలని దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) రాష్ట్ర కార్యదర్శి పులి కల్పన డిమాండ్ చేశారు. ఆదివారం సీతాఫల్‌మండిలో అంబేద్కర్ విగ్రహానికి 14వ జ్ఞానమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కల్పన మాట్లాడుతూ.. కాంగ్రెస్ మేనిఫెస్టోలో విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయిస్తామని చెప్పారని, అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీని విస్మరించిందన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లో కేవలం 7 శాతం నిధులు కేటాయించారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో కనీస వసతులు లేవకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అసర్ నివేదిక ప్రకారం 5.4శాతం పాఠశాలల్లో టాయిలెట్స్ లేవని, 19శాతం బడులు శిథిలమయ్యాయని ఆమె పేర్కొన్నారు. 27శాతం బాలికలకు మూత్రశాలల సౌకర్యం లేవన్నారు. ఈ కార్యక్రమంలో డీబీఎఫ్ నాయకులు కవిత, పరమేశ్వరి, చిత్ర తదితరులు పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహానికి జ్ఞానమాల వేసిన కల్పన తదితరులు

సైబర్ నేరాలపై సినీ నటుల అవగాహన

బంజారాహిల్స్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): సైబర్ క్రైమ్ బాధితుల సంఖ్య రోజు రోజుకు పెరిగిపోతోందని సినీ నిర్మాత బెక్కం వేణుగోపాల్ అన్నారు. సైబర్ నేరాలపై అవగాహన కలిగించేందుకు 'సైబర్ దొంగలున్నారు తస్మాత్ జాగ్రత్త' అనే నినాదంతో తకిట తదిమి తందాన చిత్ర యూనిట్ ఆదివారం ఫిలింనగర్ నుంచి జగన్నాథస్వామి దేవాలయం, కేబీఆర్ పార్కు వరకు సైకిల్ ర్యాలీ నిర్వహించింది. జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించిన వేణుగోపాల్ మాట్లాడుతూ.. సాంకేతిక పరిజ్ఞానం ఎంతలా పెరుగుతుందో అదే స్థాయిలో సైబర్ మోసాలు పెరుగుతున్నాయన్నారు. సైబర్ మోసగాళ్ల బారిన పడిన వారు ఆర్థికంగా కోలుకోలేని స్థితికి వెళ్లిపోతున్నారన్నారు. పోలీసు అధికారుల సూచనలను తప్పకుండా పాటించాలని ఆయన సూచించారు. ర్యాలీలో సినీ దర్శకుడు చంద్ర మహేశ్, నటుడు రాంకీ, ఫెటాఫ్సీ చైర్మన్ హరి గోవింద ప్రసాద్, హెచ్‌సీజీ అధ్యక్షుడు రవీంద్ర, చిత్ర నిర్మాత చందన్ కుమార్ కొప్పుల, నటులు గణ ఆదిత్య, హీరోయిన్ ప్రియ, దర్శకుడు రాజ్ లోహిత్ పాల్గొన్నారు.



సైకిల్ ర్యాలీలో పాల్గొన్న సినీ నటులు

కులగణనకు మరో అవకాశం

రాంగోపాల్‌పేట్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): 1931 తర్వాత దేశంలో మొదటి సారి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో కులగణన చేపట్టారని ఏఐసీసీ సభ్యులు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కటారి గౌరీశంకర్ అన్నారు. ప్రజాభవన్‌లో కులగణనపై జరిగిన చర్చలో ఆయన పాల్గొని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా సికింద్రాబాద్‌లో ఆయన విలేరులతో మాట్లాడుతూ.. కులగణనలో పాల్గొనని వాళ్ల కోసం ప్రభుత్వం మరో అవకాశం కల్పించిందని, ఈ అవకావాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బీఆర్ఎస్ ప్రభుత్వం గతంలో చేపట్టిన సకల జనుల సర్వే వివరాలను ఇంత వరకు ప్రజల ముందు పెట్టలేదని విమర్శించారు.



సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్న గౌరీశంకర్

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాడతాం

- తెలంగాణ మాల ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్

తార్నాక, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మాలలకు అన్యాయం చేసే విధంగా ఉన్న ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నిరంతరం ఉద్యమాలు, న్యాయ పోరాటాలు చేపడుతామని తెలంగాణ మాల ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చినేని వెంకట్ అన్నారు. ఆదివారం తార్నాకలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు సంబంధించి ఎస్సీ, ఎస్సీ ఉపకులాలు జస్టిస్ షమీమ్ అక్తర్ ఏకసభ్య కమిషన్‌కు విజ్ఞప్తులను తెలియజేయడానికి మార్చి 10 వరకు ప్రభుత్వం గడువు పొడిగించిదన్నారు. దీంతో ఈనెల 25న చేపట్టనున్న మాల విద్యార్థి, యువగర్జన సభను వాయిదా వేస్తున్నామని తెలిపారు. వచ్చే నెల 3న విద్యార్థి, యువజన కార్యవర్గ సమావేశాన్ని ఏర్పాటు చేసి భవిష్యత్ కార్యాచరణ, విద్యార్థి యువ గర్జన సభ తేదీని ప్రకటిస్తామన్నారు.

వ్యక్తి అదృశ్యం



వెంకటేష్

అడ్డగుట్ట, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): వరంగల్‌కు వెళుతున్నానని ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన తుకారాంగేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శంకర్ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. సాయినగర్‌కు చెందిన మాచ వెంకటేష్ ఈనెల 5న ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి బయటికి వెళ్లిపోయాడు. భార్య కృష్ణవేణి ఫోన్ చేసి ఎక్కడ ఉన్నావని అడుగగా వరంగల్‌కు వెళుతున్నట్లు చెప్పాడు. ఈనెల 20న మళ్లీ ఫోన్ చేసి ఎప్పుడు వస్తావని అడిగింది. 23న వస్తానని జవాబునిచ్చాడు. అప్పటి నుంచి ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి ఉంది. భర్త ఆచూకీ కోసం బంధువులు, స్నేహితుల ఇళ్ల వద్ద వెతికినా సమాచారం తెలియరాలేదు. దీంతో భార్య ఆదివారం తుకారాంగేట్ పోలీస్ స్టేషన్‌లో భర్త అదృశ్యంపై ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఉరేసుకొని ఆత్మహత్య

అడ్డగుట్ట, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): తాగుడికి బానిసైన ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన మారేడుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై సౌమ్య తెలిపిన వివరాల ప్రకారం.. భూసిరెడ్డిగూడ వెన్నల అపార్ట్‌మెంట్‌లో ఉంటున్న ఫణి కుమార్ (40) తల్లిదండ్రుల వద్ద ఉంటున్నాడు. ఈ మధ్య కాలంలో మద్యానికి బానిసయ్యాడు. ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో బెడ్‌రూంలోని ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటనపై పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. డేడ్‌బాడీని గాంధీ మార్చురీకి తరలించారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రైలు కింద పడి ఆత్మహత్య..

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మతిస్థిమితం లేక ఓ వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న ఘటన గుండ్లపోచంపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో చోటు చేసుకుంది. సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ పండరి తెలిపిన వివరాల ప్రకారం.. గుండ్లపోచంపల్లి కండ్లకోయల ప్రాంతానికి చెందిన ఆర్. శ్రీనివాస్ (18) మేస్త్రి పనిచేస్తుంటాడు. కొంత కాలంగా మతిస్థిమితం సరిగా లేదు. దీంతో జీవితంపై విరక్తి చెందిన అతను శనివారం రాత్రి గుండ్లపోచంపల్లి- మేడ్చల్ రైల్వే స్టేషన్‌ల మార్గమధ్యలో ఎదురుగా వస్తున్న ఒక ప్యాసింజర్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.



శ్రీనివాస్ మృతదేహం

గంజాయి మత్తులో స్నేహితుల మధ్య ఘర్షణ

- కత్తితో దాడి.. ఇద్దరికి తీవ్ర గాయాలు

సైదాబాద్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): గంజాయి మత్తులో స్నేహితుల మధ్య ఘర్షణ కత్తిపోట్లకు దారితీసింది. ఈ ఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలు కాగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. సింగరేణికాలనీ ఘనపురం గుడిసెలలో నివాసముంటూ కేటరింగ్ పనులు నిర్వహించే కాట్రవత్ జగన్(17) అంగోతు హర్ష(20), మధు, చంటిలు శనివారం రాత్రి చంద్రాయణగుట్టలో డిన్నర్‌కు వెళ్లి తిరిగివచ్చారు. అందరూ కలిసి జగన్ ఇంటి వద్ద కూర్చొని మాట్లాడుకుంటున్నారు. ఇంతలో అదే ప్రాంతంలో ఉండే మరో స్నేహితుడు ఆటోడ్రైవర్ ముదావత్ సురేష్(20) కత్తితో వచ్చి ఘర్షణకు దిగాడు. జగన్‌పై సురేష్ కత్తితో దాడి చేసేందుకు యత్నించగా అడ్డుకునేందుకు యత్నించిన హర్ష చాతికి గాయాలయ్యాయి. వెంటనే స్నేహితులు హర్షను స్థానికంగా ఆస్పత్రికి తరలించారు. అనంతరం తిరిగి జగన్ ఇంటికి మధు, చంటిలు వచ్చి కూర్చొని మాట్లాడుకుంటున్నారు. వాళ్లను గమనించిన సురేష్ అక్కడికి వచ్చి మరోసారి జగన్‌పై కత్తితో దాడికి యత్నించాడు. ప్రతిఘటించిన జగన్ అదే కత్తితో సురేష్‌పై దాడి చేసి తీవ్రంగా గాయపర్చాడు. వెంటనే స్థానికులు సురేష్‌ను చికిత్స కోసం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. గంజాయి మత్తులోనే ఈ దాడులు జరిగాయని తెలుస్తోంది.



ప్రమాదకరంగా కారు నడిపిన నిందితులు

ప్రమాదకరంగా కారు నడిపిన వారిపై కేసు

బంజారాహిల్స్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): ప్రమాదకరంగా కారు డ్రైవింగ్ చేస్తున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు వద్ద ఓ వ్యక్తి తోటి ప్రయాణికులకు ఇబ్బంది కలిగించేలా కారు నడపడంత పాటు ఆ వీడియోలను సోషల్ మీడియాలో పెట్టారు. వీడియో ఆధారంగా జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. వాహనం నంబర్ ఆధారంగా విచారణ చేయగా కారు నడిపిన వారు విద్యార్థులని తేలింది. మలక్‌పేటకు చెందిన మహ్మద్ అబ్దుల్ ఖాదర్, నాంపల్లికి చెందిన అన్నాస్ అహ్మదుద్దిన్, బంజారాహిల్స్‌కు చెందిన మహ్మద్ అబ్దుల్ రాహత్‌లను అరెస్టు చేసి వారు నడిపిన కారును స్వాధీనం చేసుకున్నారు.







చీరకట్టుతో రన్‌లో పాల్గొన్న మహిళలు

ఉత్సాహంగా శారీ రన్..

పులకించిన పీవీ మార్గ్

చీరకట్టుతో మెరిసిన వేలాదిమంది మహిళలు

ఖైరతాబాద్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): వేలాది మంది మహిళలు చీరలు కట్టుకొని ఉత్సాహంగా సాగర తీరం వెంట సాంప్రదాయాన్ని ప్రతిబింబించారు. చీరతో కూడిన అందాన్ని ఫిట్‌నెస్‌తో జోడిస్తూ తనైరా, జేజే యాక్టివ్‌ల సంయుక్త నిర్వహణలో పీవీ నర్సింహారావు మార్గ్‌లోని పీపుల్స్‌ప్లాజా నుంచి జలవిహార్ వరకు, తిరిగి పీపుల్స్ ప్లాజా వరకు సాగిన ఈ రన్‌లో మూడు వేలకు పైగా మహిళలు నృత్యాలు చేస్తూ సంబరంగా పాల్గొన్నారు. మహిళా సాధికారత, స్వేచ్ఛ, ఆరోగ్య పరిరక్షణలపై అవగాహన కల్పిస్తూ సాగిన ఈ రన్‌ను జేజే యాక్టివ్ కోచ్ ప్రమోద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా తనైరా సీఈవో అంబుజ్ నారాయణ మాట్లాడుతూ.. మహిళలు కుటుంబ భారాన్ని మోయడమే కాకుండా తమ ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు వ్యాయామం చేయాలని సూచించారు. ఈ రన్ మహిళల సాంప్రదాయం, ఆధునిక శక్తిని కలపడంతో పాటు దయ, స్థిరత్వంకు చిహ్నంగా నిలిచిందన్నారు. మహిళలు ఆరోగ్యం, సమగ్రతను ప్రోత్సహించడం ద్వారా సమాజ శక్తిని బలోపేతం చేస్తారన్నారు. మహిళలు సౌకర్యవంతమైన, ప్రోత్సాహకరమైన వాతావరణంలో తమ ఆరోగ్య పరిరక్షణ కోసం సమయం వెచ్చించాలని సూచించారు.



ఉత్సాహంగా పరుగులు తీస్తూ..

